సాక్షి తిరుపతి

ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



అమ్మవారి సేవలో పీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ

తిరుచానూరు శ్రీపద్మావతమ్మను ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శక్తికాంత దాస్ శనివారం దర్శించుకున్నారు. - 8లో



బాల్యానికి బలుపు గాయం!

బాల్యం బరువెక్కుతోంది. చిన్నతనంలోనే అనేక రోగాలబారిన పడాల్సిన దుస్థితి నెలకొంది. - 8లో



ఇంట్లో చోరీ

చంద్రగిరి మండలం, భీమవరం గ్రామంలో ఓ ఉపాధ్యాయురాలి ఇంటికి దొంగలు కన్నం పెట్టారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 66,327 మంది స్వామివారిని దర్శించుకోగా 26,354 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.73 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ప్రతి ఇంటా వెలగాలి నవమి కాంతులు



ఎస్. వెంకటేశ్వర్, కలెక్టర్ | హర్షవర్ధన్‌రాజు, ఎస్పీ | శుభం బన్సల్, జాయింట్ కలెక్టర్

తిరుపతి అర్బన్: తెలుగు ప్రజలకు ఎంతో పవిత్రమైన శ్రీరామ నవమి పండుగను ఆదివారం వేడుకగా జరుపుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు ఆకాంక్షించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటనలో జిల్లా ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రశాంత వాతావరణంలో శ్రీరామ నవమి వేడుకలను ప్రజలందరూ అంగరంగ వైభవంగా జరుపుకోవాలని పేర్కొన్నారు.

ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి క్రైమ్: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో శనివారం బాబు జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి అర్పించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పూల మాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.

జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: భారతదేశ మాజీ ఉప ప్రధాని, సమతావాది బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ కొనియాడారు. శనివారం కలెక్టరేట్‌లో జగ్జీవన్ రామ్ 118 జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. డీఆర్వో నరసింహులుతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణముఖిలో ఇసుక తోడేళ్లు



పడిపోతున్నా: కూలేందుకు సిద్ధంగా రావిచెట్టు



చెరబట్టేశారు: ఇసుక తోడేయడంతో ఏర్పడిన గుంతలు

కొట్రమంగళం గ్రామం తిరుపతి రూరల్, రేణిగుంట మండలాల మధ్య ఉంది. ఇక్కడ పుష్కలంగా ఇసుక ఉండడంతో కూటమి నేతల కన్ను పడింది. పగలు ట్రాక్టర్లు, రాత్రుల్లో జేసీబీలు పెట్టి ఇసుక తరలించేస్తున్నారు. కలెక్టరేట్‌కు వెనుకనే ఈతంతు జరుగుతున్నా అటు వైపు అధికారులెవ్వరూ కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

– రేణిగుంట(శ్రీకాళహస్తి రూరల్)



మొదలుపెట్టేశారు: బయటపడ్డ చెట్టు మొదలు

శ్రీసిటీ తరహాలో క్రిస్ సిటీ ఏర్పాటు కోసం సేకరించే భూముల పరిహారాన్ని నొక్కేసేందుకు గూడూరుకు చెందిన ముఖ్య నేత స్కెచ్ వేశారు. తన అనుచరులను రంగంలోకి దింపి బినామీ పేర్లతో భారీగా కొల్లగొట్టేందుకు పథకం రచించారు. అధికారులను తన చెప్పుచేతల్లోకి తీసుకుని పేదల పరిహారాన్ని బొక్కేసేందుకు సిద్ధమయ్యారు. ఈ మతలబుపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. అందరికీ పరిహారం చెల్లించాల్సిందేనంటూ రోడ్డెక్కుతున్నారు.



క్రిస్ సిటీ కోసం సేకరించిన భూములు ఇవే

అసలు కథ ఇక్కడే మొదలు

శ్రీసిటీ తరహాలో గూడూరు పరిధిలో క్రిస్‌సిటీని ఏర్పాటు చేయాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. క్రిస్‌సిటీ ఏర్పాటు కోసం ప్రభుత్వం 10,834.50 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూములను సేకరించాలని నిర్ణయించింది. అందులో భాగంగా మొదటి విడతలో 2,228.50 ఎకరాలు సేకరించమని అధికారులకు ఆదేశాలు జారీచేసింది. భూముల వివరాలు సేకరించడం పూర్తయ్యాక ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం రావడంతో గూడూరుకు చెందిన టీడీపీ ముఖ్యనేత భూ సేకరణ ప్రక్రియను తనకు అనుకూలంగా మార్చుకునేందుకు పథకం వేశారు. ఆ వెంటనే అధికారుల ద్వారా పట్టా, డీకేటీ, ప్రభుత్వ భూముల వివరాలు తెప్పించుకున్నట్లు గూడూరుకు చెందిన అధికారి ఒకరు వెల్లడించారు.

పరిహారానికి స్కెచ్!

గూడూరులో క్రిస్ సిటీ కోసం భూ సేకరణ

- ప్రభుత్వ భూములకు తన బినామీ పేర్లు చేర్చి పరిహారాన్ని నొక్కేసే కుట్ర
- అదనంగా ప్రతి ఎకరాకు రూ.లక్ష మంజూరు చేయించిన వైనం
- ఆ రూ.లక్ష కూడా స్థానిక ముఖ్య నేతకే ఇవ్వాలని అనుచరుల ద్వారా ఆదేశాలు
- అవకతవకలు జరుగుతున్నాయంటూ రోడ్డెక్కిన స్థానికులు

సాక్షి తిరుపతి టాస్క్‌ఫోర్స్: క్రిస్ సిటీ కోసం సేకరించే భూములకు ప్రభుత్వం కేటాయించిన పరిహారాన్ని నొక్కేసేందుకు టీడీపీ ముఖ్యనేత పెద్ద ప్లాన్ వేశారు. ప్రభుత్వ భూములకు బినామీ పేర్లు చేర్చి.. ఆ భూములకు వచ్చే పరిహారాన్ని స్వాహా చేయడానికి రంగం సిద్ధం చేశారు. మరోవైపు పెంచిన పరిహారాన్ని సైతం కాజేసేందుకు పథకం వేశారు. మొత్తంగా క్రిస్ సిటీకి సేకరించే కోట్లాది రూపాయల భూ పరిహారాన్ని కొల్లగొట్టేందుకు అధికారులు, అనుచరులను రంగంలోకి దించారు. ఈ విషయం లబ్ధిదారులు పసిగట్టి అధికారులను ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు.

రికార్డుల్లోకి బినామీలు

క్రిస్ సిటీ కోసం సేకరించే భూముల్లో 500 ఎకరాల ప్రభుత్వ భూములను తన అనుచరులు సాగు చేసుకుంటున్నట్లు వారి పేర్లను రికార్డుల్లో చేర్చమని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఆ 500 ఎకరాలకు వచ్చే మొత్తం పరిహారంలో గూడూరుకు చెందిన టీడీపీ నేతకు 60శాతం, మిగిలిన 40 శాతం అనుచరులు, కొందరు అధికారులకు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

పెంచిన వాటా ముఖ్యనేతకే

ప్రభుత్వ, డీకేటీ, పట్టా భూములు ఎకరాకు రూ.7 లక్షల నుంచి రూ.21.5 లక్షల వరకు పరిహారం ఇవ్వనున్న నేపథ్యంలో.. టీడీపీ నేత ఆ పరిహారంలో వాటా కోసం పథకం వేసినట్లు సమాచారం. చిల్లకూరు, కోట మండలాల పరిధిలోని 11 గ్రామాల్లో తన అనుచరులను రంగంలోకి దింపినట్లు తెలుస్తోంది. ఒక్కో గ్రామానికి ఐదుగురు సభ్యులను నియమించారు. ఆ ఐదుగురు సభ్యులు ఏది చెబితే అదే ఫైనల్ చేయాలని అధికారులకు హుకుం జారీ చేశారు. పనిలోపనిగా పరిహారం కింద చెల్లించే నిధులను అదనంగా రూ.లక్ష పెంచాలని ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి చేశారు. పథకం ప్రకారం ప్రభుత్వం అదనంగా పెంచి ఇచ్చే ఆ రూ.లక్ష పరిహారాన్ని నేరుగా టీడీపీ ముఖ్య నేతకే చేరేలా అధికారులు, అనుచరులకు బాధ్యతలు అప్పగించినట్లు విశ్వసనీయ సమాచారం.



జేసీని అడ్డుకుని నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు (ఫైల్)

అడ్డుతగులుతున్న అధికారిపై గుర్రు

ఈ విషయం జిల్లా అధికారికి తెలియడంతో అభ్యంతరం చెప్పినట్లు సమాచారం. అందులో భాగంగా ప్రభుత్వం నుంచి వచ్చిన పరిహారం నిధులను కూడా పంపిణీ చేయకుండా ఆపినట్లు తెలుస్తోంది. ఆ అధికారి అడ్డుపడుతుండడంతో అతన్ని బదిలీ చేసేందుకు అమరావతిలోని ముఖ్యనేత సహకారం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

భగ్గుమంటున్న లబ్ధిదారులు

పరిహారం స్వాహా చేసే విషయం స్థానికులు, రైతులకు తెలియడంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. తిరుపతి జేసీ శుభం బన్సల్ రెండు రోజుల క్రితం చిల్లకూరు మండలం, తమ్మినపట్నంలో పర్యటించారు. విషయం తెలుసుకున్న స్థానికులు ఆయన వాహనాన్ని అడ్డుకుని ఆందోళనకు దిగారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ.. క్రిస్ సిటీ భూముల పరిహారం విషయంలో బినామీ పేర్లతో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రతి ఒక్కరికీ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని జాయింట్ కలెక్టర్ హామీ ఇవ్వడంతో స్థానికులు ఆందోళనను విరమించారు.

ముక్కంటి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. న్యాయమూర్తులు శ్రీనివాస్‌నాయక్, బేబీరాణి పాల్గొన్నారు.



ముక్కంటి ఆలయం వద్ద జస్టిస్ చీమలపాటి రవి

పీఓఈఎం-04 శకలాలు సముద్రంలోకి


సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) గత ఏడాది డిసెంబర్ 30న పీఎస్ఎల్వీ సీ60 ద్వారా స్పేడెక్స్ ఉపగ్రహాలను నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఆ తరువాత నాలుగో దశలోని పీఎస్ఎల్వీ ఆర్బిటల్ ఎక్స్‌పరమెంట్ మాడ్యూల్(పీఓఈఎం-04) తన పనిని పూర్తిచేసింది. తదనంతరం దాని శకలాలను శనివారం ఉదయం 8.03 గంటలకు హిందూ మహాసముద్రంలో పడదోసినట్టు ఇస్రో తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. పీఎస్ఎల్వీ రాకెట్‌ల సిరీస్‌లో పీఓఈఎం-4 అంటే నాలుగో దశతో కొన్ని పేలోడ్స్ వివిధ రకాల కక్ష్యల్లో ప్రవేశపెట్టి కొత్తరకం కక్ష్యలను అన్వేషించింది. ఈ క్రమంలో ఇప్పటికి నాలుగు పీఓఈఎంలను ప్రయోగించగా పీఎస్ఎల్వీ సీ60కి అమర్చిన పీఓఈఎం మాత్రం 1000 రకాల కక్ష్యలను పూర్తి చేసి 24 పేలోడ్స్‌ను వివిధ రకాల కక్ష్యల్లోకి ప్రవేశపెట్టి తన పనిని పూర్తిచేసింది. పీఓఈఎం-4 ఇంజిన్ 55.2 డిగ్రీల వంపుతో భూమికి 350 కిలోమీటర్ల ఎత్తులో వృత్తాకార కక్ష్యను తొలగించింది. దీంతో ప్రమాదవశాత్తూ విచ్ఛిన్నమయ్యే సంభావ్య ప్రమాదాన్ని తగ్గించేందుకు మిగిలిపోయిన అపోజి ఇంధనాన్ని బయటకు పంపడం ద్వారా పీఓఈఎం-4 శకలాలు హిందూ మహాసముద్రంలో పడిపోయే విధంగా చేయడం విశేషం.



పీఎస్ఎల్వీ సీ60 రాకెట్‌లోని పీఎస్ఎల్వీ ఆర్బిటల్ ఎక్స్‌పరమెంట్ మాడ్యూల్

బహుముఖ ప్రజ్ఞ

గత ఏడాది డిసెంబర్ 30న పీఎస్ఎల్సీ 60 రాకెట్ స్పేడెక్స్ ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తరువాత పీఓఈఎం దాని కార్యకలాపాలను ప్రారంభించింది. ఈ దశలో మొత్తం 24 పేలోడ్స్‌ను అమర్చి పంపించిన విషయం తెలిసిందే. ఈ 24 పేలోడ్స్‌ను కచ్చితత్వంతో కూడిన కక్ష్యల్లో ప్రవేశపెట్టి చరిత్ర సృష్టించింది. పీఓఈఎం-4 ప్రయోగాత్మక ప్లాట్‌ఫామ్‌గా బహుముఖ ప్రజ్ఞను నిరూపించిందని ఇస్రో పేర్కొంది.



పీఓఈఎం-4 శిథిలాలను హిందూ మహాసముద్రంలోకి పడదోస్తున్న ట్రాకింగ్ చిత్రమిది

స్విమ్స్‌లో నిరంతర వైద్య విద్య కార్యక్రమం



కార్యక్రమంలో అధ్యాపకులు, వైద్యులు

తిరుపతి తుడా: స్విమ్స్ ఇమ్యూనో హెమటాలజీ, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్, ఎమర్జెన్సీ మెడిసిన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పద్మావతి ఆడిటోరియంలో నిరంతర వైద్య విద్య కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సురేష్‌బాబు ప్లాస్మాఫెరిసిస్ చికిత్స, ప్లాస్మా మార్పిడి వంటి విషయాలపై విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ రోహిత్ గుప్తా, స్విమ్స్ బ్లడ్ బ్యాంక్ విభాగాధిపతి డాక్టర్ శ్రీధర్‌బాబు, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ క్రిష్ణసింహారెడ్డి, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శృంగభంగమేనా?



వెంకటగిరి మున్సిపాలిటీ భవనం



కౌన్సిలర్లతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

9న వెంకటగిరి మున్సిపాలిటీపై అవిశ్వాస తీర్మానం

- పటిష్టంగా వైఎస్సార్‌సీపీ
- కూటమికి ఓటమి తప్పదంటున్న విశ్లేషకులు
- కౌన్సిలర్లకు కొండంత భరోసానిస్తున్న నేదురుమల్లి

సైదాపురం: వెంకటగిరి మున్సిపల్ కౌన్సిల్‌పై కూటమి నేతలు ఈనెల 9న అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యారు. మొత్తం 25 మంది కౌన్సిలర్లలో ఇద్దరు పసుపు కండువా కప్పుకోగా.. మిగిలిన 23 మంది వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారు. వీరికి వెన్నంటే ఉంటూ స్థానిక నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి భరోసానిస్తున్నారు. నిత్యం మంతనాలు జరుపుతూ వారిలో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారు. ఎవ్వరూ కూటమి వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ రాజకీయ చదరంగంలో కూటమికి ఓటమి తప్పదని విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

మున్సిపాలిటీ సమాచారం	
వార్డులు	25
వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు	25 మంది
టీడీపీ కౌన్సిలర్లు	0

మెజారిటీ స్థానాలు వైఎస్సార్‌సీపీకే

గతంలో వెంకటగిరి మున్సిపల్ చైర్మన్ పదవిని బీసీ సమాజిక వర్గానికి కేటాయించారు. దాన్నే ఆయుధంగా చేసుకున్న కూటమి నాయకులు అదే సామాజిక వర్గంలోని మరొకరిని తెరపైకి తీసుకొచ్చారు. అవిశ్వాస తీర్మానం ద్వారా దొడ్డిదారిన లబ్ధిపొందేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. ఈ వ్యవహారంపై వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రతి మునిపల్ కౌన్సిలర్‌తో సమీక్షించి వారితో ప్రత్యేకంగా చర్చించారు. దీంతో రోజురోజుకూ వైఎస్సార్‌సీపీలో నెలకొన్న అసంతృప్తి కూడా నేదురుమల్లి మంతనాలతో పటాపంచలైనట్టు స్పష్టమవుతోంది. మళ్లీ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నక్కా భానుప్రియే కొనసాగేలా చర్యలు చేపడుతున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు విప్ కూడా జారీ చేశారు.

విజయం తథ్యం

వెంకటగిరి మున్సిపాలిటీ అవిశ్వాస తీర్మానంలో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం. కూటమి కుయుక్తులకు కౌన్సిలర్లే బుద్ధిచెబుతారు. మా పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఏకతాటిపై నిలబడుతున్నారు. అనుకున్న దానికంటే మంచి మెజార్టీతో చైర్‌పర్సన్‌గా నక్కా భానుప్రియే కొనసాగనున్నారు.

– నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త

క్లుప్తంగా

అమ్మవారి సేవలో పీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ

తిరుపతి రూరల్: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రిన్సిపల్ సెక్రటరీ శక్తి కాంత దాస్ శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనతో పాటు తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య కూడా ఉన్నారు. వీరందరికీ టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం సాదర స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేయించారు. అనంతరం అమ్మవారి ఆలయ ముఖ మండపంలో వారికి వేద ఆశీర్వచనంతో పాటు తీర్థ ప్రసాదాలు అందించారు.

28 నుంచి సమ్మర్ హాబీ క్యాంప్

తిరుపతి కల్చరల్: ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో ఈనెల 28 నుంచి మే 31వ తేదీ వరకు 'సమ్మర్ హాబీ క్యాంప్' ఉంటుందని ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ కె.శ్రీనివాస నెహ్రూ తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం వరకు శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. సైన్స్ సఫారీ, పోల్డ్ కనెక్ట్ లైట్, త్రీడీ డిజైన్ ప్రింటింగ్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయోసైన్స్, జూనియర్ డ్రోన్ మాస్టర్, ఆస్ట్రోనమీ వంటి సబ్జెక్టులలో 4 నుంచి 6వ తరగతి విద్యార్థులు, టెన్త్ విద్యార్థులకు ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్యార్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 0877–2286202, 7989694681 లలో సంప్రదించాలని సూచించారు.

ప్రైవేటు బస్సు ఢీకొని వ్యక్తి మృతి

తిరుపతి రూరల్: పేరూరు గ్రామం సమీపంలోని పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో రోడ్డు దాటుతున్న వ్యక్తిని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు.. చిత్తూరు జిల్లా, పెద్దపంజాణి మండలం, పెద్ద కాపుల పంచాయతీ ఆకులవారిపల్లికి చెందిన కె. ప్రభాకర్ రెడ్డి(45) ఓ డాబా నుంచి బయటకు వచ్చి రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో చిత్తూరు నుంచి విజయవాడ వెళుతున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అతడిని ఢీ కొంది. ఈ ఘటనలో అతని తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృత దేహాన్ని శవ పరీక్ష నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. మృతుడి అన్న కొడుకు రాజేశ్వరరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ షేక్‌షా వల్లీ కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ రామకృష్ణను అదుపులోకి తీసుకుని బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బాల్యానికి బలుపు గాయం!



జిల్లాలో బరువెక్కుతున్న బాల్యం
- ప్రతి ఐదుగురిలో ఇద్దరికి ఊబకాయం
- 50 వేల మందికి పైగా బాధిత పిల్లలు
- చిన్న వయసులోనే రోగాల బారిన పడుతున్న వైనం
- మారిన ఆహారపు అలవాట్లే కారణం!
- అప్రమత్తత లేకుంటే ప్రమాదమేనంటున్న వైద్య నిపుణులు

- తిరుపతి నగరంలోని కొర్లగుంటకు చెందిన పదేళ్ల బాలుడికి అడిగినవన్నీ తల్లిదండ్రులు కొనిచ్చేవారు. పాఠశాలకు వెళ్లి వస్తూ మార్గమధ్యంలో బేకరీ వద్ద చిప్స్, కేక్‌లు, బిస్కెట్లు కొని తెచ్చుకునేవాడు. దీంతో పాటు కావాల్సినప్పుడల్లా ఆన్‌లైన్‌లో పిజ్జాలు, బర్గర్లు తెప్పించుకుని తినేవాడు. దీంతో స్థూలకాయం పెరిగింది. మైదానానికి తీసుకెళ్లినా ఎక్కువసేపు నడవలేకపోయేవాడు. దీనికితోడు తరచూ రోగాల బారినపడేవాడు. ఏం చేయాలో తెలియక తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు.
- తిరుపతి బైరాగిపట్టెడకు చెందిన 12 ఏళ్ల బాలుడికి కొంత కాలం క్రితం ఊబకాయం వచ్చింది. తరచూ కడుపు నొప్పి వస్తుండడంతో వైద్యుల వద్దకు తీసుకెళ్లారు. వైద్యపరీక్షల్లో బాలుడికి ఫ్యాటీ లివర్‌తో పాటు షుగర్ ఉన్నట్లు తేలింది. ఆటలు ఆడకుండా నిత్యం వీడియోగేమ్స్ ఆడుకుంటూ ఉండడం వల్ల ఈ సమస్య వచ్చిందని వైద్యులు తేల్చారు.

.. ఇది ఈ ఇద్దరి సమస్యే కాదు. పట్టణాల్లోని పిల్లలకు ఇప్పుడు అధిక బరువు ఒక సమస్యగా మారిపోయింది. ఒకప్పటిలా పాఠశాలల్లో ఇప్పుడు ఆటపాటలు లేవు. ఉదయం నుంచి రాత్రి వరకు చదువు పేరుతో ఒకేచోట కూర్చుంటున్నారు. ఇంటికి వచ్చాక భోజనం చేసి... వీడియోగేమ్స్ ఆడుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. దీని కారణంగా చిన్న వయస్సులోనే ఊబకాయం వస్తోంది. ఫలితంగా షుగర్, రక్తపోటు, గుండె జబ్బులు, పీసీఓఎస్ వస్తున్నాయి. చిన్నతనం నుంచే మందులతో జీవితాన్ని నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. – తిరుపతి తుడా

పెరుగుతున్న 'ఊబకాయం'!

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం ఐదేళ్లలోపు పిల్లల్లో అధిక బరువు సమస్య 2015–16లో 2.1శాతం ఉండగా 2013లో 3.4 శాతానికి పెరిగింది. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ప్రతి ఐదుగురిలో ఇద్దరు ఊబకాయంతో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. జిల్లాలో 2015లో 22వేల మంది పిల్లలు ఊబకాయంతో బాధ పడుతుండగా.. ప్రస్తుతం ఈ సంఖ్య 50వేల దాకా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ప్రధానంగా ఈ సమస్య గ్రామీణ ప్రాంతాల్లో కంటే పట్టణ ప్రాంతాల్లో అధికంగా ఉంది. పండ్లు, కూరగాయలు, చిరు దాన్యాలు వాడే సంప్రదాయం నుంచి ఎక్కువ కొవ్వు గల పదార్థాలు, చక్కెర, ఉప్పు అధికంగా ఉండే ఆహా రం వైపు మారడమే ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు.

ఆటలకు దూరం..బరువు ఖాయం!

జిల్లాలో 30 ఏళ్ల క్రితం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతో పాటు క్రీడలకు అంతే ప్రాధాన్యం ఇచ్చేవారు. ఈ మేరకు అన్ని పాఠశాలల్లో మైదానాలు ఉండేవి. క్రీడల కోసం ప్రత్యేకంగా ఒక పీరియడ్ ఉండేది. సాయంత్రం వేళల్లో పిల్లలను మైదానంలో ఆడనిచ్చేవారు. సాయంత్రం 5 గంటలకంతా పిల్లలు ఇళ్లకు చేరుకునేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. కార్పొరేట్ విద్యాసంస్థల రాకతో విద్య రూపురేఖలు మారిపోయాయి.

ఆహారపు అలవాట్లతోనే ప్రమాదం

నగరాలు, పట్టణాల్లో ఎక్కడపడితే అక్కడ ఫాస్ట్‌ఫుడ్ లభిస్తోంది. ఇందులో పానీపూరి, కట్లెట్, కచోరి వంటి ఆహార పదార్థాలు తినేందుకు పిల్లలు ఆసక్తి చూపిస్తున్నారు. పిల్లల కోరికను కాదనలేక తల్లితండ్రులు సాయంత్రం వేళల్లో వాటిని తినిపిస్తున్నారు. ప్రధానంగా ఇందులో నిషేధిత రంగులతో పాటు చైనా సాల్ట్ కలుపుతుండడంతో హార్మోన్ల అసమతుల్యత పెరుగుతోంది. అలాగే రెస్టారెంట్లు, హోటళ్లలోని బిర్యానీలు, గ్రేవీ, ఫ్రై చేసిన ఆహార పదార్థాల్లోనూ నిషేధిత రంగులు, చైనా సాల్ట్ విచ్చలవిడిగా వాడుతున్నారు. దీంతో పాటు జంక్ ఫుడ్ (పిజ్జాలు, బర్గర్లు) లో అధిక శాతం కొవ్వు ఉంటోంది. దీన్ని ఎక్కువ తినడం వల్ల త్వరగా ఊబకాయులు మారిపోతున్నారు.

ఊబకాయంతో దుష్పరిణామాలు
- అధిక రక్తపోటు. గుండె జబ్బులు సర్వసాధారణం
- విటమిన్ల లోపం, డిప్రెషన్
- క్రీడల్లో చురుగ్గా పాల్గొనలేకపోవడం

ఇలా చేస్తే మంచిది
- పిల్లలను ఫాస్ట్, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంచాలి. పండ్లు, కూరగాయల సలాడ్ అలవాటు చేయాలి.
- పాఠశాలకు వెళ్లేటప్పుడు టిఫిన్ బాక్సులో పండ్లను చేర్చాలి.
- పిల్లలను ఆటల్లో ప్రోత్సహించాలి. వారంతాల్లో మైదానాలకు తీసుకెళ్లి ఆడించాలి.
- క్రీడలకు ప్రాధాన్యమిచ్చే పాఠశాలల్లో చేర్పించాలి
- తినేటప్పుడు టీవీ, కంప్యూటర్, మొబైల్ ఫోన్ చూడడం మాన్పించాలి.

వ్యాయామం తప్పనిసరి



మా వద్దకు రోజూ 5 నుంచి 10 మంది పిల్లలు ఊబకాయ సమస్యతో చికిత్సకు వస్తున్నారు. చిన్నతనం నుంచి అధికంగా ఫ్రై ఐటమ్స్, బేకర్, జంక్, ఫాస్ట్ ఫుడ్ తీసుకోవడం, వ్యాయామం లేక పోవడంతో ఈ సమస్య వస్తోంది. చిన్న పిల్లల లివర్లో ఫ్యాట్ చేరుకుంటోంది. దీంతో గుండెపోటు వచ్చే ప్రమాదముంది.
– డాక్టర్ రమేష్, బెరియాట్రిక్ సర్జన్, తిరుపతి

జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి



ఊబకాయానికి కారణం పిల్లలు తీసుకునే ఆహారమే. ఆరోగ్యకరమైన ఆహారం అందించాలి. పిల్లలకు ఆకుకూరలు, కాయగూరలతో కూడిన ఆహారాన్ని అందించాలి. పండ్లు, కోడిగుడ్డు వంటివి ప్రతి రోజూ తినేలా చూడాలి. జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉంచాలి. కొవ్వు పదార్థాలను తక్కువగా అందించాలి.
– డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, చిన్నపిల్లల వైద్యనిపుణులు, తిరుపతి

ఇన్సూరెన్స్ డబ్బు కోసమే కిడ్నాప్

- తిరుపతి జీవకోన కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు
- ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీలత



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీలత, సీఐ,ఎస్ఐ

తిరుపతి అర్బన్: డబ్బు కోసం ఏకంగా స్నేహితుడితోపాటు వారి కుటుంబ సభ్యులను కిడ్నాప్ చేశాడు. డబ్బులు ఇవ్వకుంటే ప్రాణాలు తీస్తామని బెదిరించిన ఘటన అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. తిరుపతి ఈస్ట్ డీఎస్పీ శ్రీలత శనివారం అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి నగరం, జీవకోనలో నివాసం ఉంటున్న కాసరం రాజేష్(33) మీ సేవా కేంద్రాన్ని నడపడంతోపాటు ఇన్సూరెన్స్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆయన స్నేహితుడు భార్గవ్ అలియస్ భాను కూడా జీవకోన ప్రాంతంలోనే నివాసం ఉన్నాడు. అయితే కాసరం రాజేష్ తల్లికి తాజాగా ఇన్సూరెన్స్ డబ్బులు పెద్ద మొత్తంలో వచ్చినట్లు తెలుసుకున్న భాను ఆ డబ్బులను ఎలాగైనా కొట్టేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో భాను తమ స్నేహితులైన వట్టికుంట అరుణ్‌కుమార్ అలియాస్ అరుణ్(తిరుపతి), ధమకోతి సాయికుమార్(శ్రీకాళహస్తి మండలం), బాలిపాకు మణికంఠ(రేణిగుంట మండలం), చీరాల ప్రకాష్(ఏర్పేడు మండలం), సిరియాల గమేష్(పెళ్లకురూ మండలం)కు చెందిన వారితో కలసి కుట్రకు శ్రీకారం చుట్టారు. ఈ ఆరుగురు గత నెల 28న ఓ ప్రణాళిక ప్రకారం కాసరం రాజేష్‌తో పాటు కుటుంబ సభ్యులను తిరుపతిలో కిడ్నాప్ చేశారు. ఇన్సూరెన్స్ డబ్బులు ఇస్తే వదిలేస్తామని లేదంటే ఐదుగురిని చంపేస్తామని బెదిరించారు.

తెలివిగా వ్యవహరించిన రాజేష్

కాసరం రాజేష్ తెలివిగా ఇన్సూరెన్స్ డబ్బులు తిరుపతిలో తమ వద్దలేవని.. చిత్తూరులోని తమ బంధువుల వద్ద ఉందని వారికి చెప్పాడు. దీంతో నిందితులు ఆరుగురు తాము కిడ్నాప్ చేసిన ఐదుగురిని తీసుకుని రెండు కార్లలో చిత్తూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో ఐతేపల్లి వద్ద కాసరం రాజేష్ కారులో నుంచి దూకి తప్పించుకున్నాడు. దీంతో నిందితులు మిగిలిన కుటుంబ సభ్యులను అక్కడే వదిలిపెట్టి పరారయ్యారు. కాసరం రాజేష్ అలిపిరి పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుల కోసం తొమ్మిది రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శనివారం రేణిగుంట–కడప రోడ్డు మార్గంలో కుక్కలదొడ్డి వద్ద రెండు కార్లలో ఆరుగురు నిందితులు హైదరాబాద్‌కు పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారితోపాటు 7 మొబైల్‌ఫోన్లు, 4 కత్తులు, 5మీటర్ల ప్లాస్టిక్ తాడు, వాటర్ ప్రూఫ్ టేప్, 60 నైలాన్ టైస్, ఓ ఐరన్ రాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు పంపుతున్నట్లు వెల్లడించారు. నిందితుల్లో అరుణ్‌కుమార్, భార్గవ్, సాయిపై గతంలో పలు కేసులున్నాయని పేర్కొన్నారు.

'ఉపాధి' అక్రమాలపై కేంద్రం సీరియస్!

- చంద్రగిరి నియోజకవర్గంలో సమగ్ర విచారణకు ఆదేశం
- మూడు రోజుల్లో విచారణ పూర్తి చేయాలన్న కమిషనర్
- 24 గంటల్లో నివేదిక ఇవ్వాలని పీడీకి కలెక్టర్ ఉత్తర్వులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: చంద్రగిరి నియోజకవర్గంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఉపాధి పనుల్లో చోటు చేసుకున్న అక్రమాలపై కేంద్రం సీరియస్ కావడంతో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల్లో కదలిక వచ్చింది. చంద్రగిరి నియోజకవర్గంలో జరిగిన ఉపాధి పనుల్లో అక్రమాలపై సమగ్ర విచారణకు కేంద్రం నుంచి ఆదేశాలు రావడంతో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సీరియస్‌గా తీసుకున్నారు. కేంద్రం నుంచి వచ్చిన ఆదేశాలతో మూడు రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని ఉత్తర్వులు జారీచేశారు. దీంతో తిరుపతి జిల్లా కలెక్టర్ చంద్రగిరి నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన ఉపాధి పనులపై దర్యాప్తునకు ఆదేశించినట్టు సమాచారం. ఈ విచారణలో ఎవ్వరిని బాధ్యులను చేస్తారో..? ఎంత మందిపై చర్యలు తీసుకుంటారో..? అన్న భయం అవినీతి, అక్రమాలకు సహకరించిన అధికారుల్లో పట్టుకుంది.

వరుస ఫిర్యాదులు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉన్నతాధికారులకు చంద్రగిరి నియోజకవర్గం నుంచి వరుస ఫిర్యాదులు అందడంతో కేంద్రం సీరియస్‌గా తీసుకుని విచారణకు ఆదేశించింది. కేంద్రం ఆదేశాలతో అప్రమత్తమైన రాష్ట్ర స్థాయి అధికారులు అసలు చంద్రగిరి నియోజకవర్గంలో ఏం జరుగుతోంది ? ఉపాధి పనుల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఇప్పటి వరకు వచ్చిన ఫిర్యాదులపై ఏం చర్యలు తీసుకున్నారు..? కేంద్రం లక్ష్యానికి తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్న అధికారులపై తీసుకున్న చర్యలు ఏమిటి..? అన్న అంశాలపై వివరణ కోరుతూ సమగ్ర విచారణకు ఆదేశించినట్టు సమాచారం.

భయం భయం

గత పది నెలలుగా అధికార పార్టీ నేతలకు వంత పాడుతూ ఉపాధి పనుల్లో అవినీతి, అక్రమాలకు అన్ని విధాలుగా సహరించిన అధికారుల్లో భయం పట్టుకుంది. చంద్రగిరి నియోజకవర్గంలో జరిగిన ఉపాధి పనుల్లో అవినీతి, అక్రమాలకు సంబంధించిన సంపూర్ణ సమాచారం కేంద్రం చేతిలో ఉండడంతో ఈ వ్యవహారంపై దర్యాప్తు చేయడానికి వచ్చే విచారణ అధికారి వాస్తవాలతో నివేదిక అందజేయాల్సి ఉంటుంది. అలా కాదని అవినీతికి సహకరించిన అధికారులను కాపాడడంలో భాగంగా నివేదికను మరోలా ఇచ్చినట్లయితే ఇప్పటికే కేంద్రం వద్దనున్న సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక కమిటీని ఢిల్లీ నుంచి పంపించే అవకాశం ఉంటుంది. ఆ కమిటీ నివేదిక ఆధారంగా సామాన్యులు మెయిల్ చేసిన సాక్షాధారాలు ఒక్కటేనని తేలినట్లయితే అవినీతికి సహకరించిన అధికారులతో పాటు విచారణాధికారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ పరిణామాలతో సిబ్బందిలో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న గుబులు పట్టుకుంది. గతంలో చంద్రగిరి నియోజకవర్గంలోని ఎర్రావారిపాళెం మండలంలో జరిగిన ఉపాధి పనుల అవినీతిలో ఫీల్డు అసిస్టెంట్ నుంచి ఎంపీడీఓ స్థాయి అధికారి వరకు సస్పెండ్ అయిన దాఖలాలు ఉండడం, ఈ విచారణలో ఎవరిపై వేటు పడుతుందోనన్న ఉత్కంఠ స్థానికంగా నెలకొంది.

అర్ధరాత్రి గ్యాంగ్ వార్




ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గాయపడిన వ్యక్తులు

తిరుపతి క్రైమ్: నగరంలోని రెండు హోం స్టేల మధ్య అర్ధరాత్రి గ్యాంగ్ వార్ జరిగింది. ఈ ఘటన శనివారం వేకు జామున చోటుచేసుకుంది. ఈస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బస్టాండ్ సమీపంలోని చింతల్ చేను వద్ద రెండు హోంస్టేల్స్ మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. డిస్కన్ సూట్స్ హోమ్ స్టే నిర్వాహకులపై కర్రలు, రాడ్లతో గరుడ హోమ్ స్టే యాజమాన్యం దాడి చేసింది. ఇందులో డస్క్ సూట్స్ హోమ్స్ డే నిర్వాహకులు నరేష్, నవీన్, లక్ష్మీనారాయణ, పణీందర్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. వీరి వద్దకు వచ్చే కస్టమర్లను మరొక హోమ్ స్టే వాళ్లు లాక్కెళ్తున్నా రని వీరి మధ్య గొడవ చోటుచేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. దాడికి పాల్పడిన ఏడుగురిని ఈస్ట్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. నగరంలో అర్ధరాత్రి ఇలాంటి ఘటనలు జరగడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

అనుమతి లేని హోం స్టేలపై చర్యలు శూన్యం

నగరంలో హనుమతులేని హోమ్ స్టేలు విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా రూములను అద్దెకి తీసుకొని హోమ్ స్టేల్ పేర్లతో నిర్వహిస్తున్నారు. ఇవన్నీ కూడా అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారిపోతున్నాయి. నిరంతరం గొడవలు చోటుచేసుకుంటున్నాయి. అయితే పోలీసులు మామూలు మత్తులో తూలుతూ.. వారికే వత్తాసు పలుకుతున్నారు. ఇప్పటికైనా ఇలాంటి వాటిపై పోలీసులు దృష్టి పెట్టాల్సి ఉంది.

ఇంట్లో చోరీ

చంద్రగిరి: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన మండల పరిధిలోని భీమవరం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. భీమవరం గ్రామానికి చెందిన సుమతి వెదురుకుప్పం మండలంలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తూ తిరుపతిలో నివాసం ఉంటున్నారు. ఆదివారం పండుగ సందర్భంగా శనివారం ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లో ఉంచిన 64 గ్రాముల బంగారం, కిలో వెండితో పాటు రూ.లక్ష నగదు దోచుకెళ్లినట్లు గుర్తించారు. అనంతరం బాధితురాలు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఏఎస్ఐ దుర్మరణం



మృతుడు రఘుకుమార్

పుత్తూరు: విధులు ముగించుకుని గ్రామానికి చేరుకుంటున్న ఏఎస్ఐ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన సంఘటన శనివారం రాత్రి పుత్తూరు మండలం వేపగుంట క్రాస్ వద్ద చోటు చేసుకుంది. సీఐ సురేంద్రనాయుడు కథనం మేరకు.. పుత్తూరు మండలం వేపగుంట పంచాయతీ అక్కేరి దళితవాడకు చెందిన ఎ.రఘుకుమార్(59) తిరుపతి ఎంఆర్‌పల్లెలో ఆర్ముడు రిజర్వు పోలీస్ ఫోర్స్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్నారు. శనివారం యథావిధిగా విధులను ముగించుకుని తిరుపతి నుంచి బస్సులో స్వగ్రామానికి బయలుదేరి వేపగుంట గ్రామం వద్ద దిగి రోడ్డు క్రాస్ చేస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి 108లో పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.